క్లుప్తంగా

ఎరువుల దుకాణాల తనిఖీ

భట్టిప్రోలు: మండలంలోని ఎరువుల దుకాణాలను ఏఓ జి. మీరయ్య శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పల్లెకోనలోని ఓ ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలించారు. తగిన ధ్రువీకరణ పత్రాలు సమర్పించకపోవడంతో రూ. 4.58 లక్షల వ్యయం చేసే ఎరువుల అమ్మకాలు నిలిపి వేసినట్లు ఏవో మీరయ్య తెలిపారు. మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణదారులు రికార్డులన్నీ సక్రమంగా ఉండేలా చూసుకోవాలని, లేకపోతే విక్రయాలు నిలుపుదల చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

సైన్సుపై పట్టుసాధించాలి

బాపట్ల: సైన్సుపై విద్యార్థులు పట్టు సాధించాలని బధిరుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపల్ బి.అరుణ పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ డే ఆఫ్ సైన్సు లాంగ్వేజస్ సందర్భంగా శనివారం విద్యార్థులకు పలు పోటీ పరీక్షలు నిర్వహించారు. బధిరులకు సాంకేతిక భాషపై పట్టుసాధిస్తే మంచిదని తెలిపారు. అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

1న యోగాసనాల పోటీలు

బాపట్ల: జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆక్టోబరు 1న యోగాసనాల పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అల్లాడి రవికుమార్ పేర్కొన్నారు. స్థానిక చీలు రోడ్డులోని ఎకో హౌస్‌లో పోటీలు ఉంటాయని తెలిపారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో బాల, బాలికలకు పోటీలు ఉంటాయని తెలిపారు. విజేతలకు ఆక్టోబరు 14, 15 తేదీల్లో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు కళ్ళం హరినాథరెడ్డి, గౌరవాధ్యక్షుడు డాక్టరు బి.శరత్‌బోస్, పిన్నిబోయిన శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

జోనల్ క్రికెట్ టోర్నమెంట్‌కు బాపట్ల యువకుడు



బాపట్ల అర్బన్: ది ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-25 జోనల్ క్రికెట్ టోర్నమెంట్‌కు బాపట్ల యువకుడు గంటా అదర్శ సాయి ఎంపికైనట్లు అసోసియేషన్ సెక్రటరీ గోపీనాథ్‌రెడ్డి శనివారం తెలిపారు. గుంటూరు జిల్లా స్థాయిలో అండర్-19, 25 విభాగాలలో పాల్గొని, అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన ఆదర్శసాయి ఐదు జిల్లాల స్థాయిలో జరిగే జోనల్ క్రికెటోర్నమెంట్‌కు ఎంపికయ్యాడని చెప్పారు. ఈ పోటీలు ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకు కడపలో జరగనున్నాయి. బాపట్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంటా అంజిబాబు కుమారుడు ఆదర్శసాయి క్రికెట్లో ప్రతిభ కనబరచటం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

కోనేటిపురం(భట్టిప్రోలు): కోనేటిపురంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. డీ -బ్రీఫింగ్ సమావేశానికి జిల్లా కార్యాలయం నుంచి ఎస్ఎఫ్ఏ బీవీ శ్రీనివాసరావు విచ్చేసి ఈ నెలలో నిర్వహించిన కార్యక్రమాల వివరాలు తెలుసుకున్నారు. పంట పొలాలను పరిశీలించారు. సూరేపల్లి, ఐలవరం యూనిట్ ఐసీఆర్పీస్ ఎంసీఏ డి.ఝాన్సీరాణి, రైతులు పాల్గొన్నారు.

ధర్నా అనుమతికి వినతి

రేపల్లె రూరల్: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి ఈ నెల 25న విజయవాడలో నిర్వహించ తలపెట్టిన ధర్నాలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్‌లు పాల్గొనాలని ఏఐటీయూసీ నాయకులు జి.నాగమల్లేశ్వరమ్మ పిలుపునిచ్చారు. ధర్నాకు సంబంధించి పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో సీడీపీవో మాణిక్యానికి శనివారం వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఏఐటీయూసీ నాయకులు కనకదుర్గ, శ్రీలేఖ, అనుష్కా రాణి, రమాదేవి పాల్గొన్నారు.

మెస్ చార్జీల పెంపునకు డిమాండ్

రేపల్లె రూరల్: ప్రభుత్వ కళాశాలల్లో చదివే ఇంటర్మీడియట్ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆర్య అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలేజీల్లో మధ్యాహ్న భోజనం పథకాన్ని పునఃప్రారంభించాలన్నారు. సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు రూ.3000 వరకు మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రసాద్, నాగర్జున, రాకేష్ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి భరోసా..!

- గ్రామాల్లో విస్తృతంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే
- ఇంటింటికి వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది
- సాధారణ, దీర్ఘకాలిక రోగుల గుర్తింపు, వివరాలు నమోదు
- బాలింతలు, గర్భిణులపై ప్రత్యేక దృష్టి
- సర్వే అనంతరం వైద్య శిబిరాలకు టోకెన్లు అందజేత



వేమూరులో ఇంటింటి సర్వే చేస్తున్న ఏఎన్ఎం, వలంటీర్లు

వేమూరు: ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పించింది. వైద్య వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చింది. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు చేస్తోంది. తాజాగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గ్రామీణ, పట్టణాల్లోని ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. సాధారణ, దీర్ఘకాలిక రోగులను గుర్తించి, మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది.

ఇంటింటికి సర్వే..

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏఎన్ ఎంలు, గ్రామ వలంటీర్లు ఈ నెల 16 నుంచి ఇంటింటికి వెళ్లి ఆరోగ్య సర్వే చేపడుతున్నారు. వేమూరు మండలంలోని 17 పంచాయతీలకు 14 విలేజ్ క్లినిక్‌లు ఉన్నాయి. వీటి పరిధిలో ప్రతి ఒక్కరికీ వైద్య సేవలను అందిస్తారు. ఈ సర్వేలో భాగంగా ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ప్రాథమిక వైద్య పరీక్షలు చేసి, ఆరోగ్య సమస్యలను గుర్తిస్తున్నారు. ఇప్పటికే 30శాతం వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా సర్వేలో గర్భిణులు, బాలింతలు, తగిన బరువు లేని పిల్లలు, క్షయ, కుష్టు, సక్రమించే వ్యాధులు, డెంగీ, మలేరియాతో బాధపడే వారిపై దృష్టి సారిస్తున్నారు. సర్వే సమయంలో ఫోటో తీసి, ప్రత్యేక యాప్‌లో వివరాలు అప్‌లోడు చేస్తున్నారు. అనంతరం నిర్వహించిచిన పరీక్ష ఫలితాలను డాక్టర్లు అందుబాటులో ఉంచుతారు. ఆరోగ్య సమస్యలు ఉన్న వారు వైద్య శిబిరాలను హాజరయ్యేందుకు వీలుగా ఏఎన్ఎంలు టోకెన్లు అందిస్తున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నియమించిన అధికారులు నిరంతర పర్యవేక్షిస్తుంటారు. ఈ నెల 30న మండస్థాయిలో ఇద్దరు డాక్టర్లు పర్యవేక్షణలో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తారు. వీరితో పాటు 104 వాహనంలో ఉండే డాక్టర్ కూడా అందుబాటులో ఉంటారు. మండలంలో ఎన్ని విలేజ్ హెల్త్ క్లినిక్ ఉన్నాయో వాటి పరిధిలోని గుర్తించిన రోగులందరికీ ఆ రోజు శిబిరంలో చికిత్స అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. శిబిరాల నిర్వహణలో ఎంపీడీవో, తహసీల్దారు మొదలు అన్ని శాఖల అధికారులు పాలు పంచుకోవాల్సి ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి



జగనన్న ఆరోగ్య సురక్ష కార్య క్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఏఎన్ఎంలు, వలంటీర్లు నిర్వహించే ఇంటింటి సర్వేకు పూర్తి స్థాయిలో సహకారించాలి.

– డాక్టరు వెంకట సురేష్, పెరవలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం.

మండలాభివృద్ధే లక్ష్యం

- ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి
- భట్టిప్రోలు మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లలిత కుమారి

భట్టిప్రోలు: మండల అభివృద్ధే లక్ష్యంగా అధికారులు ప్రజాప్రతినిధుల సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి కోరారు. మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ అధ్యక్షతన శనివారం జరిగింది. మండలంలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సూచించారు. వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను సభ్యులకు వివరించారు. అజెండాలో పేర్కొన్న అంశాలను వారి దృష్టికి తీసుకువచ్చారు. మండలంలో అనర్హులైన లబ్ధిదారులు సీసీఆర్సీ కార్డులు పొందారని కో–ఆప్షన్ సభ్యుడు షేక్ సలీమ్ సమావేశంలో ప్రస్తావించారు. ఇందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పందించిన తహసీల్దారు డి. వెంకటేశ్వరరావు, ఏవో జి. మీరయ్య బాధ్యులపై చర్యలు తీసుకుని, రెవెన్యూ యాక్ట్ ద్వారా లబ్ధిపొందిన మొత్తాన్ని రికవరీ చేస్తామని తెలిపారు. విద్యుత్ కోతలపై ఇన్‌చార్జ్ విద్యుత్ ఏఈ ఏడుకొండలను సభ్యులు ప్రశ్నించారు. ప్రస్తుతం సబ్ స్టేషన్‌లో మరమ్మతు పనులు జరుగుతున్నాయని ఏఈ సమాధానం ఇచ్చారు. ముమ్ముందు ఎలాంటి సమస్య లేకుండా చూస్తానని ప్రకటించారు. జగనన్న కాలనీల్లో నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, మల్లోలు ఉషారాణి, సూపరింటెండెంట్ జలజ, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోనున్న సీఎం వైఎస్ జగన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మ్యానిఫెస్టోలో చెప్పినవి, చెప్పనవి మరెన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి, రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి పేర్కొన్నారు. ప్రజా సేవే పరమావధిగా పని చేస్తున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున ఆశీస్సులతో ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలుగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ముందస్తుగా మండల పరిషత్ కార్యాలయంలో వేడుకలు జరుపుకున్నారు. ఎంపీపీ లలిత కుమారి మాట్లాడుతూ తోటి ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో మండల అభివృద్ధికి తమ వంతు కృషి చేసినట్లు చెప్పారు. ఇలాగే ముమ్ముందు కూడా ఇదే విధంగా సహాయ సహకారాలు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, వైస్ ఎంపీపీలు కొతరపు పిచ్చయ్యశాస్త్రి, మల్లోలు ఉషారాణి, ఎంపీటీసీ గద్దె సుశీల, రావు రాజేశ్వరి, దారావత్ కుమారీ భాయ్, నీలా సాంబమ్మ పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం



సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

నగరం: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని సీహెచ్‌వో ఎస్.బాబురావు అన్నారు. మండలంలోని నగరం ఎస్టీ కాలనీలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను శనివారం ఆయన పర్యవేక్షించారు. ఈ నెల 15 నుంచి గ్రామ వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే చేస్తున్నట్లు తెలిపారు. 30 వరకు సర్వే జరుగుతుందన్నారు. ప్రతి ఇంటిని సందర్శించి వ్యాధులు ఉన్నవారిని గుర్తించి వైద్య శిబిరాలకు హాజరయ్యే విధంగా టోకెన్లు ఇస్తున్నట్లు వెల్లడించారు. సర్వే నివేదికల ఆధారంగా ఆయా గ్రామాలలో వైద్య శిబిరాలను ఏర్పాటుచేయనున్నట్లు పేర్కొన్నారు. వీటిని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎం విమల, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ రక్ష

ఏట్రువారిపాలెం(కర్లపాలెం): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రభుత్వం అందరికీ ఆరోగ్య రక్ష కల్పించనున్నదని ఏట్రువారిపాలెం సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి తెలిపారు. శనివారం గ్రామంలో ఆరోగ్య కార్యకర్తలు, వాలంటీర్ల ఆధ్వర్యంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను సర్పంచ్ వెంకటలక్ష్మి పర్యవేక్షించారు. వచ్చే నెల 9న గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని తెలిపారు. సీహెచ్ఎస్ యు. ప్రభావతి, గ్రామ పంచాయతీ కార్యదర్శి డి.పద్మావతి, ఏఎన్ఎం టి.రమాదేవి, సీహెచ్‌వో శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పిల్లల వైద్య శిబిరం

భట్టిప్రోలు: న్యూలై ఫ్ చిల్డ్రన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం భట్టిప్రోలులోని సాయిబాబా గుడి సమీపంలోని వేణుగోపాలస్వామి ఆవరణలో సాయి కృష్ణ కళావేదిక వద్ద పిల్లల ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ రాజశేఖర్ కుప్పా పేర్కొన్నారు. వైద్యులు రాధిక, రాజశేఖర్ కుప్పా(పురిటి, చిన్నపిల్లల అత్యవసర వైద్య నిపుణులు), కేటీఎస్ శ్రీనివాసరావు, అఖిల్ గారపాటి (చిన్న పిల్లల వైద్య నిపుణులు)లు వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో రక్త పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందచేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

25, 26న నియోజకవర్గ స్కూల్‌గేమ్స్ సెలక్షన్స్

రేపల్లె రూరల్: పట్టణంలోని మౌంటు ఫోర్ట్ స్కూల్ గ్రౌండ్‌లో ఈ నెల 22, 23 తేదీల్లో జరగాల్సిన నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ పోటీలను 25వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు మండల స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ వై.రమేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 25న బాలికలకు, 26న బాలురికి పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అండర్-14, 17 విభాగాల్లో నిర్వహించే పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ పాఠశాల హెచ్ఎం నుంచి అనుమతి పత్రంతో హాజరు కావాలని తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పేరలిపాడు(కర్లపాలెం): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల సీజనల్ వ్యాధులను నివారించుకోవచ్చని పేరలిపాడు గ్రామ సర్పంచ్ కాగిత కరుణ కుమారి తెలిపారు. ఆరోగ్య సిబ్బంది గ్రామంలో పర్యటించి, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల నివారణకు గ్రామంలో ఫాగింగ్ నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ ఇసాక్, కార్యదర్శి డి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నియోజకవర్గ కబడ్డీ జట్టుకు విద్యార్థుల ఎంపిక

భట్టిప్రోలు: వేమూరు మండలం జంపని జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలలో భట్టిప్రోలు విశ్వశాంతి హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. విద్యార్థులు ఎం. పవన్ కుమార్, జి. రవితేజ, జి. సురేష్ తేజ, ఎన్. సావంత్ నియోజకవర్గ జట్టుకు ఎంపికయ్యారని కరస్పాండెంట్ ఎంపీ వెంకట్రావు, హెచ్ఎం ఫణి పార్థసారథి తెలిపారు. వారిని అభినందించారు.

మౌలిక వసతులు కల్పించాలి



రాఘవులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రమాదేవి

భట్టిప్రోలు: స్థానిక జగనన్న కాలనీలో రహదారులు, విద్యుద్దీపాలు తదితర మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి. రమాదేవి కోరారు. శనివారం ఆమె గృహ నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ లే అవుట్ పల్లంగా ఉన్నందున మెరక వేయాల్సిన అవసరం ఉందన్నారు. వెంటనే ప్రభుత్వం మెరకలు తోలించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆమె వెంట సీపీఎం బాపట్ల జిల్లా కార్యదర్శి జి. గంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు టి. కృష్ణమోహన్, మండల కమిటీ సభ్యులు ఎం.సత్యన్నారాయణ, జి. నాగరాజు, బి. నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

సీపీఎం నేత రాఘవులుకు నివాళి

పెదపులివర్రు(భట్టిప్రోలు): పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని కోళ్లపాలేనికి చెందిన సీపీఎం నాయకుడు చీకటి రాఘవులు మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి. రమాదేవి పరామర్శించారు. రాఘవులు సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన లంక భూమి, కూలీ పోరాటాల్లో ప్రధాన భూమిక వహించారని పేర్కొన్నారు. సీపీఎం నాయకులు నాగరాజు, కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తంతా రోబోటిక్ టెక్నాలజీదే



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న శ్రీనివాసరావు

బాపట్ల అర్బన్: భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు రోబోటిక్ టెక్నాలజీని మరింతగా నేర్చుకోవాలని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు అన్నారు. బీఈసీ ఆవరణలో రోబోటిక్ ప్రాసెసింగ్‌పై ఐదు రోజుల వర్క్ షాప్‌ను సెప్టెంబరు 19 నుంచి 23 వరకు నిర్వహించారు. శనివారం జరిగిన వర్క్ షాప్ ముగింపు సభకు ముఖ్య అతిథులుగా శ్రీనివాసరావు, కార్యదర్శి మానం నాగేశ్వరరావు విచ్చేసి, విద్యార్థులకు సర్టిఫికేట్‌లను పంపిణీ చేశారు. రిసోర్స్ పర్సన్ నాగరాజు మాట్లాడుతూ రోబోటిక్ టెక్నాలజీ అతి తక్కువ సమయంలో యూఐ పాత్ అనే టూల్ ద్వారా చేయవచ్చని తెలిపారు. వశిష్ట టెక్నాలజీ తరపున ఎస్.శ్రీనివాసరావు విషయ నిపుణులుగా వ్యవహరించారు. బీటెక్ విద్యార్థులు 120 మంది ఈ వర్క్‌షాపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ తమ భవిష్యత్తు కోసం ఎంత వ్యయానికైనా వెనుకంజ వేయకుండా సదుపాయాలను కల్పిస్తున్న బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీకి రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు దొప్పలపూడి రామ్మోహన్ రావు, గెల్లి దిలీప్ కుమార్, సంయుక్త కార్యదర్శి కొమ్మినేని హరిపద్మ ప్రసాద్, కోశాధికారి తాళ్లూరి రామకృష్ణారావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నజీర్, విభాగాధిపతి డాక్టర్ నల్లూరి శేషప్రసాద్, సమన్వయకర్తలు డాక్టర్ బి. కృష్ణయ్య, కృష్ణరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో శారీరక, మానసిక ఆరోగ్యం



హనుమాన్ చాలీసా, లాకెట్‌ల పంపిణీ

రేపల్లె రూరల్: ఆధ్యాత్మిక చింతన కలిగిన ప్రతి ఒక్కరూ సంపూర్ణ మానసిక, శారీరక ఆరోగ్యం కలిగి ఉంటారని ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడు మద్ది బదిరీ నారాయణమూర్తి అన్నారు. కోటి హనుమాన్ చాలీసా పారాయణ మహా యజ్ఞం ప్రచార కార్యక్రమంలో భాగంగా టీటీడీ ధర్మ ప్రచార వెంకటేశ్వరుని మహా రథం శనివారం రేపల్లె పట్టణంలో కొనసాగింది. పట్టణ ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ ప్రజల్లో భక్తి భావాలను పెంపొందించటంతోపాటు హైందవ ధర్మపరిరక్షణ కోసం ప్రచార కార్యక్రమాన్ని తలపెట్టడం అభినందనీయమన్నారు. నిత్యం హనుమాన్‌చాలీసా పఠనం చేయాలన్నారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా పట్టణ ప్రజలకు హనుమాన్ చాలీసా పుస్తకం, ఆంజనేయ, వెంకటేశ్వర స్వామి ప్రతిమలతో కూడిన లాకెట్‌లను పంపిణీ చేశారు. జనవరి 21న తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ అవుట్ డోర్ స్టేడియంలో లక్ష మందితో నిర్వహించనున్న కోటి హనుమాన్ చాలీసా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు నంబూరి సత్యప్రసాద్, తటవర్తి విజయ్‌కుమార్, యెందూరి రాజేష్, ఆలపాటి శివశంకరరావు, బొలిశెట్టి రామచంద్రరావు, బొలిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌ల పంపిణీ



గర్భిణులకు కోడిగుడ్లు అందజేస్తున్న ఎంపీటీసీ సాంబశివరావు

కర్లపాలెం: వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లోని పౌష్టికాహారాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు అన్నారు. నల్లమోతువారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం జరిగిన పోషకాహార మాసోత్సవాల్లో ఆయన పాల్గొని, గర్భిణులకు, బాలింతలకు వైఎస్సార్ పోషణ కిట్లు అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య మాట్లాడుతూ మహిళలలో ఉండే రక్తహీనత నివారణకు వైఎస్సార్ పోషకాహార కి ట్లు దోహదపడతాయని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, ఏఎన్ఎం రత్నమాల, సీహెచ్‌వో అనూష, మహిళా పోలీస్ వాణి సచివాలయం సిబ్బంది నాగరాజు, కార్తీక్, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

ఇంటింటి ధర్మ ప్రచారం కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శేషాచార్యులు

చెరుకుపల్లి: హిందువులు పరధర్మం స్వీకరించకూడదని సమరసతా ఫౌండేషన్ జిల్లా సాంస్కృతిక విభాగ ప్రముఖ్ అగ్నిహోత్రం శేషాచార్యులు అన్నారు. మండల పరిధిలోని ఆరేపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ గంగా పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం ఇంటింటి ధర్మ ప్రచారం కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. శేషాచార్యులు మాట్లాడుతూ హిందూ ధర్మం అందరి మానవుల సంక్షేమాన్ని కోరుకునేదని, సమస్త జీవ కోటి సుఖసంతోషాలతో ఉంటుందన్నారు. అందరి బాగును కోరుకునేది హిందూ ధర్మమే అని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షుడు చీరాల ప్రసాద్ రెడ్డి, నాగసాయి, చింతల మురళీకృష్ణ, పొన్నపల్లి సత్యన్నారాయణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నిమజ్జనోత్సవం



బాపట్ల: వినాయక చవితి నవ రాత్రులు సందర్భంగా ఆరోవ రోజు అత్యంత వైభవంగా వినాయకునికి పూజలు నిర్వహించారు. లడ్డూను దక్కించుకునేందుకు వేలం పాటలో భక్తులు పోటీలుపడ్డారు. స్థానిక భీమావారిపాలెంలోని పార్కు వద్ద ఏర్పాటు చేసిన గణేషుని విగ్రహం వద్ద లడ్డూని రూ.10800కు కారుమూడి శ్రీనివాసరావు సొంతం చేసుకున్నారు. కమిటీ సభ్యులు భక్తిశ్రద్ధలతో ఊరేగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా చుట్టుపక్కల నుంచి సూర్యలంక సముద్ర తీరంలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. భీమావారిపాలెంలోని వినాయకుని ఊరేగింపులో కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

ఘనంగా గణేష్ నిమజ్జనం

కర్లపాలెం: వినాయక చవితిని పురస్కరించుకుని అగ్రహారం గణేష్ విగ్రహానికి శనివారం భక్తి శ్రద్ధలతో నిమజ్జనోత్సవం నిర్వహించారు. మండల పరిధిలోని పెదగొల్లపాలెం, పేరలి గ్రామాలలో పూజలందుకున్న గణపతి విగ్రహాలను స్థానిక పంట కాలువలలో నిమజ్జనం చేశారు.